నమస్తే తెలంగాణ
భద్రాద్రి కొత్తగూడెం
3 | ఖమ్మం, గురువారం 21 మార్చి 2024 | BHADRADRI KOTHAGUDEM

భూగర్భ జలాలను పరిశీలిస్తున్న అధికారి (ఫైల్)

అడుగంటిన పాతాళగంగ

చింతకాని మండలం లచ్చగూడెం వ్యవసాయ బావిలో అడుగంటిన నీరు

- ఎండిపోతున్న బావులు, చెరువులు
- భారీగా పడిపోయిన భూగర్భ జలాలు
- 6.22 మీటర్ల లోతుకు చేరిన ఖమ్మం జిల్లా సగటు
- సత్తుపల్లి ఏరియాలో రికార్డుస్థాయిలో ఢమాల్
- ఆందోళనలో 'యాసంగి' రైతులు

ఖమ్మం వ్యవసాయం, మార్చి 20 : తలాపున గోదారి, మరోవైపు సాగర్ ప్రాజెక్టు కాలువలు, జిల్లా నడిమిట్లో ప్రధాన రిజర్వాయర్లు ఉన్నప్పటికీ సాగు నీటి ఎద్దడి రోజురోజుకూ తీవ్రతరమవుతున్నది. రెండు కాదు.. ఒక్కో ఏరియాలో మూడు పంటలు సైతం పండించిన చరిత్ర ఖమ్మం జిల్లా రైతాంగానికి ఉంది. అలాంటి పరిస్థితి నుంచి నేడు యాసంగిలో తిండిమందం ధాన్యం పంట పండించుకోవడానికి రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు. వాన కాలం ఆరంభంలో వారం రోజులపాటు కురిసిన వర్షాలు ఆ తరువాత కనుమరుగయ్యాయి. అయితేనేం సాగర్ కాలువలో నీటి విడుదల అయితే చాలు పుష్కలంగా వరి, మక్క సాగు చేయవచ్చు అనుకున్న రైతులకు నిరాశే మిగిలింది. కనీసం ఆరు తడి పంటలకు సైతం నీరు విడుదల కాకపోతుందా.. అని సాగు చేపట్టిన రైతులు ఇప్పుడు తలలు పట్టుకుంటున్నారు. అడుగంటుతున్న భూగర్భ జలాలతో అతలాకుతలమవుతున్నారు. జనవరిలో జిల్లాలో భూగర్భ జలాల సగటు 5.46 మీటర్ల లోతు కాగా.. ఫిబ్రవరి చివరి నాటికి పాతాళగంగ 6.22 మీటర్ల లోతుకు వెళ్లింది. గత ఏడాది ఫిబ్రవరిలో జిల్లా సగటు 4.46 మీటర్ల లోతులోనే నీటి లభ్యత ఉంది. ఈ సంవత్సరం భూగర్భ జల శాఖ అధికారుల పరిశీలన తరువాత ఫిబ్రవరి చివరిలో 6.22 మీటర్ల జిల్లా సగటు నమోదైంది. ఈ నెల చివరి వరకు మరో 2 మీటర్ల లోతుకు పాతాళగంగ కిందికి పోయే అవకాశం ఉందని సంబంధిత అధికారులు పేర్కొంటున్నారు. పాలేరు నుంచి మొదలుకొని జిల్లా సరిహద్దు గంగారం వరకు ప్రతి మండలంలో భూగర్భ జలాలు దినదినం పడిపోతుండడంతో రిజర్వాయర్లు, బోరు బావులు, ఓపెన్‌బావులను నమ్ముకొని సాగు చేపట్టిన రైతులు ఆందోళన చెందుతున్నారు. వైరా, పాలేరు, లంకాసాగర్ రిజర్వాయర్ల పరిధిలో సైతం గత ఏడాదితో పోల్చితే సగానికి సగం సాగు విస్తీర్ణం తగ్గడం ఆందోళనకు గురిచేస్తున్నది. భూగర్భ జలాలు తగ్గడంతో తద్వార వారం రోజుల నుంచి క్రమంగా బోరుబావులు, ఓపెన్ బావులు సైతం ఎండిపోతున్న పరిస్థితి నెలకొంది. దీంతో వరుస తడులతో వరి పంటను కాపాడుకునే పనిలో రైతులు ఉన్నారు.

మండలాలవారీగా భూగర్భ జలాల నిల్వలు..

ఖమ్మం జిల్లా భూగర్భ జలశాఖ అధికారుల నివేదిక ప్రకారం ఫిబ్రవరి చివరి నాటికి జిల్లావ్యాప్తంగా సరాసరి 6.22 మీటర్ల లోతుకు నీటి లభ్యత ఉందని అధికారులు నిర్ధారణ చేశారు. సరిగ్గా ఏడాది క్రితం ఇదేరోజు నాటికి కేవలం 5.46 మీటర్ల లోతులోనే నీటి లభ్యత ఉంది. సత్తుపల్లి మండలంలో రికార్డుస్థాయిలో భూగర్భ జలాలు అడుగంటిపోయాయి. మండల పరిధిలో 17.42 మీటర్ల లోతుకు పాతాళగంగ వెళ్లిపోయింది. దీంతో సత్తుపల్లి నియోజకవర్గంలో పలు మండలాల్లో తాగునీటి కొరత సైతం ఏర్పడే అవకాశం ఉంది. ఏన్కూరు మండలంలో 9.51 మీటర్లు, ఎర్రుపాలెం 9.77 మీటర్లు, మధిర 6.84 మీటర్లు, కామేపల్లి 10.23 మీటర్లు, సింగరేణి 6.81 మీటర్లు, రఘునాథపాలెం 7.44 మీటర్లు, పెనుబల్లి 5.95 మీటర్లు, వేంసూరు 6.87 మీటర్లు, కూసుమంచి 5.36 మీటర్ల దిగువలో సరాసరి సగటును అధికారులు గుర్తించారు. అయితే మార్చి చివరినాటికి జిల్లాలో సగానికి సగం బోరు బావులు పూర్తిగా ఎండిపోయే అవకాశం స్పష్టంగా కనపడుతున్నది. జిల్లావ్యాప్తంగా భూగర్భ జలశాఖ ఏర్పాటు చేసిన 66 పాయింట్ల వద్ద ఫిబ్రవరి నెలకు సంబంధించిన శాంపిల్స్ సేకరిస్తున్నారు. సాగర్ కాలువ పరీవాహక ప్రాంతంలో బోరుబావుల కింద సాగు చేసిన వరి పొలాల సాగు భవితవ్యం ప్రశ్నార్థకంగా మారే అవకాశం ఉంది.

ఐదేండ్ల భూగర్భ నీటినిల్వలు ఇలా..

సంవత్సరం	నీటి లభ్యత
2020-జనవరి	4.93 మీటర్లు
2021-జనవరి	3.83 మీటర్లు
2022-జనవరి	4.56 మీటర్లు
2023-జనవరి	5.46 మీటర్లు
2024-మార్చి	6.22 మీటర్లు

'వద్దిరాజు'కు ఉప రాష్ట్రపతి అభినందన

ఎంపీ వద్దిరాజు రవిచంద్రను అభినందిస్తున్న ఉప రాష్ట్రపతి

ఖమ్మం, మార్చి 20: రాజ్యసభకు తిరిగి ఏకగ్రీవంగా ఎన్నికైన వద్దిరాజు రవిచంద్రకు ఉప రాష్ట్రపతి, రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధనఖర్ అభినందనలు తెలిపారు. శాసనసభ్యులు మీ సేవల పట్ల మరింత నమ్మకం కలిగి, విశ్వాసం కలిగి తిరిగి రాజ్యసభకు ఎన్నుకున్నారని తన సందేశంలో పేర్కొన్నారు. మరోసారి రాజ్యసభకు ఎన్నికైన తర్వాత ఎంపీ రవిచంద్ర రాజ్యసభ చైర్మన్ ధనఖర్‌ను ఢిల్లీలో బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వద్దిరాజుతో ఉప రాష్ట్రపతి మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య దేవాలయమైన ఈ పార్లమెంట్‌లో అర్థవంతమైన, ఆరోగ్యకరమైన చర్చలు జరిపేందుకు మీ అనుభవం ఎంతో అవసరమని అన్నారు. కాగా, తనకు శుభాకాంక్షలు, అభినందనలు తెలిపిన చైర్మన్ జగదీప్ ధనఖర్‌కు ఎంపీ వద్దిరాజు హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

ప్రలోభాల నియంత్రణకు పటిష్ట చర్యలు

ఖమ్మం కలెక్టర్ వీపీ గౌతమ్

మాట్లాడుతున్న కలెక్టర్ వీపీ గౌతమ్

మామిళ్లగూడెం, మార్చి 20 : పార్లమెంట్ ఎన్నికల్లో డబ్బు, మద్యం, ఇతర ప్రలోభాలను నియంత్రించడానికి పటిష్ట చర్యలు చేపట్టాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వీపీ గౌతమ్ అన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో బ్యాంకర్లు, ఎక్సైజ్, వ్యయ నియంత్రణ కమిటీలతో ఎన్నికల సందర్భంగా డబ్బు, మద్యం, ప్రలోభాల జప్తులపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో స్వేచ్ఛాయుత, న్యాయబద్ధ ఎన్నికల నిర్వహణకు తమవంతు కృషి చేయాలన్నారు. బ్యాంకర్లు పెద్ద మొత్తంలో లావాదేవీలు, బల్క్ లావాదేవీలు, ఒకటి కంటే ఎక్కువ సంఖ్యలో డిజిటల్ లావాదేవీలపై రోజువారీ నివేదిక సమర్పించాలన్నారు. ఎఫ్ఎస్టీ, ఎస్ఎస్టీలలో సీజ్ అయిన వాటికి వెంటనే ఎఫ్ఐఆర్ అయ్యేలా చూడాలన్నారు. పెట్రోల్ పంప్, జ్యూవెలరీ యజమానులు రోజువారీ నగదు లావాదేవీలు, ఎంత నగదు, ఎవరి ద్వారా వెళ్తుందో వివరాలు ఇవ్వాలన్నారు. ఇప్పటివరకు జిల్లాలో రూ.1,69,904 విలువ చేసే మద్యం సీజ్ చేశారని, 21 బెల్ట్ షాపులను సీజ్ చేసి, కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ప్రింటింగ్ ప్రెస్ యజమానులతో సమావేశం నిర్వహించి, ఎన్నికల ప్రవర్తనా నియమావళిపై అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ డి.మధుసూదన్ నాయక్, జిల్లా సహకార అధికారి మురళీధర్‌రావు, అదనపు డీసీపీ ప్రసాద్‌రావు, ఎక్సైజ్ సూపరింటెండెంట్ నాగేందర్‌రెడ్డి, సీపీవో శ్రీనివాస్, ఎల్డీఎం శ్రీనివాసరెడ్డి, బ్యాంకర్లు, ఐటీ, జీఎస్టీ అధికారులు, పెట్రోల్ పంపు యజమానులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలి

భద్రాద్రి కలెక్టర్ ప్రియాంక ఆల

మాట్లాడుతున్న కలెక్టర్ ప్రియాంక ఆల

భద్రాద్రి కొత్తగూడెం, మార్చి 20 (నమస్తే తెలంగాణ) : జిల్లాలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలని కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల అధికారులను ఆదేశించారు. బుధవారం ఐడీవోసీలోని మీడియా కాన్ఫరెన్స్ హాల్‌లో సంబంధిత శాఖల అధికారులతో తాగునీటి సరఫరాపై కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుత ఎండలకు జలాశయాల్లో నీటి నిల్వలు తగ్గుతున్నందున రాబోయే రోజుల్లో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలన్నారు. మున్ముందు ఏయే ప్రాంతాల్లో ఎంత మేర నీటి లభ్యత ఉంటుందో గుర్తించి కార్యాచరణ చేపట్టాలన్నారు. బోర్ల మరమ్మతు, ఫ్లషింగ్‌లు చేయాలని, ప్రైవేట్ బావులను లీజుకు తీసుకొనే చర్యలు చేపట్టాలన్నారు. తాగునీటి సరఫరా విషయమై మంజూరు పనులు యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలన్నారు. బోర్‌వెల్ ఆపరేటర్లు అనుమతి లేకుండా ప్రైవేట్ బోర్లు వేస్తే వాల్టా చట్టం ప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. కొత్త బోర్ల మంజూరుపై నియమ నిబంధనలు కచ్చితంగా పాటించాలన్నారు. గత ఏడాది నీటి ఎద్దడిని ఎదుర్కొన్న గ్రామాల్లో సమస్య పునరావృతం కాకుండా చూడాలని, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలన్నారు. మిషన్ భగీరథ ఏఈలు క్షేత్రస్థాయిలో తిరిగి తాగునీటి సరఫరాలో ఉత్పన్న మయ్యే సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి సరిచేయాలన్నారు. తాగునీటి ట్యాంకుల పరిశుభ్రత పూర్తి బాధ్యత కార్యదర్శులదేనని అన్నారు. సమావేశంలో డీఆర్‌డీవో విద్యాచందన, మిషన్ భగీరథ ఈఈ తిరుమలేష్, ఇన్‌చార్జి డీపీవో సుధీర్‌కుమార్, అన్ని మండలాల మిషనర్ భగీరథ డీఈలు, ఎంపీడీవోలు, ఎంపీవోలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలి : సీపీ సునీల్ దత్

- కమిషనరేట్ పరిధిలో కేంద్ర బలగాలతో ఫ్లాగ్‌మార్చ్

ఫ్లాగ్‌మార్చ్ చేస్తున్న కేంద్ర పోలీస్ బలగాలు

మామిళ్లగూడెం, మార్చి 20 : పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు తమ ఓటు హక్కును స్వేచ్ఛాయుత వాతావరణంలో వినియోగించుకోవాలని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అన్నారు. బుధవారం పోలీస్ కమిషనరేట్ పరిధిలో సెంట్రల్ పోలీస్ ఫోర్స్, పారా మిలటరీ బలగాలు, స్థానిక పోలీసు సిబ్బందితో కలిసి ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ శాంతిభద్రతలకు భంగం కలగకుండా పార్లమెంట్ ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. క్రిటికల్ పోలింగ్ స్టేషన్లలో కట్టుదిట్టమైన బందోబస్తుకు అవసరమైన సన్నాహాలు చేపట్టామన్నారు. అందులో భాగంగానే పోలీసు కవాతు నిర్వహించామన్నారు. పోలీస్ స్టేషన్లవారీగా ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించడం.. ప్రశాంత వాతావరణానికి భంగం కలిగించే నేరచరితులను బైండోవర్ చేస్తున్నట్లు పేర్కొన్నారు. అక్రమ మద్యం, నగదు, కానుకల రవాణాకు చెక్ పెట్టేందుకు జిల్లా సరిహద్దులో చెక్ పోస్టుల ద్వారా నియంత్రించే చర్యలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. లైసెన్స్ ఆయుధాలు డిపాజిట్ చేసేలా అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలు నిర్భయంగా తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు వీలుగా ఖమ్మం నగరంతోపాటు వైరా, సత్తుపల్లి, మధిర, ఖమ్మం రూరల్ పోలీసుల ఆధ్వర్యంలో వివిధ ప్రాంతాల్లోని సెంట్రల్ పోర్స్‌తో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించినట్లు తెలిపారు. జిల్లా పోలీసులు నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ.. పోలీస్ పెట్రోలింగ్ వాహనాలు, బ్లూ కోల్ట్స్ బృందాలు బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తిస్తున్నారని సీపీ పేర్కొన్నారు.

శాంతిభద్రతల సమస్యలు రానీయొద్దు

- లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి
- అనుమానితులను వెంటనే బైండోవర్ చేయాలి: సీపీ సునీల్ దత్

వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న సీపీ సునీల్‌దత్

మామిళ్లగూడెం, మార్చి 20: పార్లమెంటు ఎన్నికల వేళ శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా పోలీసులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సీపీ సునీల్‌దత్ ఆదేశించారు. లోక్‌సభ ఎన్నికల సందర్భంగా జిల్లాలోని పోలీస్ అధికారులతో బుధవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. కీలకమైన ఎన్నికల సమయంలో ముందు జాగ్రత్తగా హిస్టరీ షీటర్లు, చెడు నడత కలిగిన రౌడీషీటర్ల కదలికలపై నిఘా పెట్టాలని సూచించారు. ఏదైనా అనుమానం వస్తే వెంటనే అదుపులోకి తీసుకుని బైండోవర్ చేయాలని ఆదేశించారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. అక్రమ నగదు, మద్యం, ప్రలోభాల నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జిల్లాలో 12 ఎఫ్ఎస్‌టీ, 15 ఎస్ఎస్‌టీ, 2 ఇంటిగ్రేటెడ్ ఇంటర్ స్టేట్ చెక్ పోస్టులు, 10 ఇంటర్ స్టేట్ చెక్ పోస్టులు, 8 ఇంటర్ డిస్ట్రిక్ట్ చెక్ పోస్టులు ఏర్పాటు చేసినందున వాటిల్లో 24/7 నిఘా ఉండాలని ఆదేశించారు. అదే సమయంలో సాధారణ ప్రజలు, ప్రయాణికులకు ఇబ్బందులు రానీయొద్దని సూచించారు. క్రిటికల్, వనరబుల్ పోలింగ్ కేంద్రాల గుర్తింపులో ఎన్నికల మార్గదర్శకాలపాటించాలని ఆదేశించారు. ఎన్నికల ప్రక్రియను కేంద్ర ఎన్నికల కమిషన్ నిశితంగా పరిశీలిస్తోందని అన్నారు. లోపాలకు తావు లేకుండా మార్గదర్శకాలు పాటిస్తూ సమర్థవంతంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్ పరిధిని మూడు నుంచి నాలుగు సెక్టార్లుగా విభజించి ఎస్సై, ఏఎస్సై, హెడ్ కానిస్టేబుళ్లకు బాధ్యతలు అప్పగించేందుకు వీలుగా మ్యాపింగ్ సిద్ధం చేయాలని సూచించారు. అడిషనల్ డీసీపీ ప్రసాద్‌రావు, ఏఎస్‌పీ అవినాశ్‌కుమార్ పాల్గొన్నారు.

ఎన్నికల వ్యయంపై నిరంతర నిఘా

పార్లమెంటు ఎన్నికల వ్యయ పరిశీలకుడు, నోడల్ అధికారి ఖుర్షీద్

నోడల్ అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న ఎన్నికల వ్యయ పరిశీలకుడు ఖుర్షీద్

భద్రాద్రి కొత్తగూడెం, మార్చి 20 (నమస్తే తెలంగాణ): పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల ఖర్చులపై నిరంతరం నిఘా ఉండాలని ఎన్నికల వ్యయ పరిశీలకుడు, నోడల్ అధికారి సయ్యద్ ఖుర్షీద్ సూచించారు. లోక్‌సభ ఎన్నికల నిర్వహణలో భాగంగా అన్ని నియోజకవర్గాల నోడల్ అధికారులకు స్థానిక కలెక్టరేట్‌లో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎలాంటి ఖర్చులను పరిగణనలోకి తీసుకోవాలి? అభ్యర్థుల వివరాలు ఎలా ఉన్నాయి? ఇతర వివరాలు ఏమిటి? అనే అంశాలను పరిశీలించాలని సూచించారు. అసిస్టెంట్ అబ్జర్వర్లు, అబ్జర్వర్లు, వీడియాగ్రఫీ బృందాల సభ్యులు ప్రతి అంశాన్నీ నిశితంగా పరిశీలించాలని సూచించారు. పినపాక, అశ్వారావుపేట, కొత్తగూడెం, ఇల్లెందు, భద్రాచలం నియోజకవర్గాల నుంచి నోడల్ అధికారులు హాజరయ్యారు. ఈ శిక్షణలో ఎన్నికల ట్రైనింగ్ అధికారి ఎండీ అలీం, ఇతర అదికారులు పాల్గొన్నారు.

వలసొస్తున్నారు..

- జీవాల మేత కోసం సంచార బాట
- ఇతర ప్రాంతాల నుంచి జిల్లాకు గొల్ల, కురుమలు
- వేలాది జీవాలతో చినుకుపడేదాక ఇక్కడే..
- ఎరువు కోసం ఆశ్రయమిస్తున్న రైతులు

ఇతర జిల్లాల నుంచి వలసొచ్చిన గొర్రెల మందలు

కూసుమంచి, మార్చి 20 : జీవాల మేత కోసం ఇతర ప్రాంతాల నుంచి ఖమ్మంజిల్లాకు గొల్ల, కురుమలు వలసొస్తున్నారు. వారి ప్రాంతాల్లో మేత లేకపోవడంతో మహబూబ్‌నగర్, హైదరాబాద్, నల్లగొండ, ఇబ్రహీంపట్నం, దామరచర్ల, పిడుగురాళ్ల వంటి తదితర ప్రాంతాల నుంచి వేలాది జీవాల మందలతో వచ్చారు. ఇక్కడ మిర్చితోటలు, వరి పొలాలు కోసిన తరువాత మేత దొరుకుతుందని అనేక ప్రాంతాల నుంచి గొర్రెల మందలను తోలుకొని వలసవచ్చారు. ప్రస్తుతం కూసుమంచి, నేలకొండపల్లి మండలాల్లో వీరు సంచరిస్తున్నారు. గొల్ల, కురుమలకు రైతులు డబ్బులిచ్చి జీవాల మందలను వారి చేలల్లో ఎరువు కోసం రాత్రిళ్లు నిలిపి ఉంచుతున్నారు. ఈవిధంగా సుమారు రెండునెలలపాటు ఈ ప్రాంతంలో రైతుల పొలాలు, చేలలో ఎరువులు పెట్టేవిధంగా వాటిని ఉపయోగిస్తున్నారు. సంచారం చేస్తున్న గొల్ల, కురుమల బరువులు మోయడానికి గాడిదలు, గుర్రాలు, కాపలా కోసం కుక్కలను వెంట తీసుకొచ్చారు. జీవాలను ఉదయం మేతకు తీసుకెళ్లడం, రాత్రిళ్లు పొలాల్లో ఎరువు కోసం ఉంచడం చేస్తున్నారు. బుధవారం కూసుమంచిలో గొల్ల, కురుమలను 'నమస్తే' పలుకరించగా సుమారు 40 బ్యాచ్‌లు గత 15 రోజులుగా ఈ ప్రాంతంలో జీవాల మేత కోసం తిరుగుతున్నట్లు చెప్పారు. తమ ప్రాంతాల్లో జీవాలకు మేత దొరకడం లేదని, ఈ పరిస్థితి గత 20 ఏండ్ల కింద వచ్చిందని యాదవులు తెలిపారు. వలసొచ్చిన వారిలో ఎవ్వరిని కదిలించినా వారి మందలో సుమారు 150కి పైగా జీవాలు ఉన్నట్లు చెబుతున్నారు.

చినుకు పడేదాక ఇక్కడే ఉంటాం..

మా దగ్గర మేత లేదు. అందుకే ఇక్కడికి వలసొచ్చాం. ఇక్కడ కూడా మేత పెద్దగా లేదు. సుమారు ఐదువేల మందతో 10 కుటుంబాల వాళ్లం వచ్చాం. ఈ ప్రాంతంలో చినుకుపడేదాక ఉంటాం. ఎరువు కోసం రైతుల భూముల్లో మందను ఆపితే వాళ్లు డబ్బులు ఇస్తారు. వాటిని ఇంటికి పంపిస్తాం. రోజుకు 800 నుంచి రూ.వెయ్యి వరకు ఇస్తున్నారు.

– రావు జంగమయ్య, రాప్రోలు, ఇబ్రహీంపట్నం

4 వేల గొర్రెలతో వచ్చాం..

మాది నిమ్మికల్లు. మా దగ్గర మేత దొరుకుతలే. ఎండాకాలం జీవాలను బతికించుకోవాలంటే వలస వెళ్లాల్సిందే అనుకొని బైలెల్లినం. 20ఏండ్ల కిందట గిట్లనే కాలం కాలేదు.. గప్పుడు కూడా వలసొచ్చాం. కుటుంబంతో కలిసి అందరం వచ్చాం. బరువులు మోయడానికి గుర్రాన్ని తెచ్చుకున్నాం. రైతులు ఎరువు కోసం రాత్రిళ్లు మందను తమ భూముల్లో ఆపుకొంటున్నారు. వాళ్లు ఇచ్చే డబ్బులతో జీవనం గడిపేస్తున్నాం.

– బయ్యా మల్లయ్య, నిమ్మికల్

రమ్మన్నారు.. 'కోడ్' అన్నారు..!

సమావేశానికి ఎందుకు పిలిచారో చెప్పండి: జడ్పీటీసీ వెంకట్‌రెడ్డి

మొక్కుబడిగా జడ్పీ స్థాయీ సంఘాల సమావేశం

సమావేశానికి హాజరైన ఒకే ఒక్క ప్రజాప్రతినిధి

భద్రాద్రి కొత్తగూడెం, మార్చి 20 (నమస్తే తెలంగాణ) : ప్రజా సమస్యలపై చర్చించనప్పుడు సమావేశాలు ఎందుకు.. మమ్మల్ని ఎందుకు పిలవాలి.. మా సమయాన్ని ఎందుకు వృథా చేయాలి అని చంద్రుగొండ జడ్పీటీసీ వెంకట్‌రెడ్డి ప్రశ్నించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పరిషత్ స్థాయీ సంఘాల సమావేశం బుధవారం నిర్వహించగా.. అధికారులు ఇలా వచ్చి కనిపించి వెళ్లగా.. జడ్పీ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్‌రావు కొద్దిసేపు ఉండి వెళ్లిపోయారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ వెంకట్‌రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ సమావేశాలు ఏర్పాటు చేయనప్పుడు.. ఎన్నికల కోడ్ ఉంది.. కుదరదు అన్నప్పుడు.. మాకు సమాచారం ఇవ్వొద్దన్నారు. జడ్పీ సమావేశాలను కొందరు నిర్వీర్యం చేస్తున్నారని, సభ్యులు అడిగిన ప్రశ్నలకు కూడా వచ్చే సమావేశంలో సమాధానాలు ఇవ్వలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయ శాఖపై సమావేశం కొనసాగుతున్నప్పుడు అందులో నీటిపారుదల శాఖ అధికారులను ఉంచకపోవడం కొంత ఇబ్బందికరంగా ఉందన్నారు. సమావేశానికి సభ్యులందరూ హాజరుకావాలని పిలిచిన జడ్పీ సీఈవో కూడా లేకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. కాగా.. కొందరు అధికారులు మాత్రం సమావేశానికి వచ్చి రిజిష్టర్‌లో సంతకాలు పెట్టి వెళ్లిపోయారు. చివరికి జడ్పీ చైర్మన్ కూడా సమావేశం నుంచి వెళ్లిపోయారు. ఆఫీస్ సిబ్బంది మాత్రం ఎన్నికల కోడ్ అమలులో ఉన్నదని, అందువల్ల తీర్మానాలు చేయొద్దని అధికారులకు చెప్పి పంపించారు.

'నిబంధనలు కచ్చితంగా అమలు చేయాలి'

అధికారులకు సూచనలిస్తున్న అదనపు కలెక్టర్ వేణుగోపాల్

అశ్వారావుపేట, మార్చి 20 : ఎంపీ ఎన్నికల్లో నిబంధనలను క్షేత్రస్థాయిలో కచ్చితంగా అమలు చేయాలని ఎన్నికల రిజిస్ట్రేషన్ అధికారి, అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన ఎన్నికల సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. నిబంధనలు ఉల్లంఘించే పార్టీలు, నేతలపై చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని, తాగునీరు, దివ్యాంగులకు ర్యాంపులతోపాటు విద్యుత్ సౌకర్యం కల్పించాలని పేర్కొన్నారు. 85 ఏళ్లు పైబడిన వారికి, దివ్యాంగులకు ఇంటి నుంచే ఓటు వేసే వెసులుబాటు కల్పించినందున అందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. అనంతరం రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్ట్‌ను ఆయన తనిఖీ చేశారు. అక్రమ మద్యం, నగదు తరలింపుపై గట్టి నిఘా పెట్టాలని సూచించారు. సమావేశంలో తహసీల్దార్లు, ఎంపీడీవోలు, సెక్టార్ ఆఫీసర్లు, ఫ్లయింగ్ స్క్వాడ్, నిఘా బృందాల బాధ్యులు పాల్గొన్నారు.